# అర్హత

'సాహితి'

''మేడమ్!''

ప్రావిడెంట్ ఫండ్‌లోంచీ విత్‌డ్రా చేసిన డబ్బుని పర్సులో పెట్టుకుంటున్న సమీర తలెత్తి చూసింది.

తన ముందున్న టేబుల్‌కి అవతలి అంచుని నిలబడి వేదమూర్తి ఏదో అడగడానికి సంశయిస్తున్నట్టున్నాడు. ఏమిటన్నట్టు కళ్ళతోటే ప్రశ్నించింది.

''మా అబ్బాయి ఫీజు..మీరు..మీరేమీ అనుకోకపోతే ఒక్క..ఫైవ్‌హండ్రెడ్..అప్పుగానే..శాలరీ రాగానే యిచ్చేస్తాను.మా మిసెస్‌కి వంట్లోబాగుండక పోవడంతో యీనెల..బడ్జెట్..అప్సెటైంది...ప్లీజ్..'' మాటకి మాట అతుక్కోకుండా అతను చెప్పున్నదంతా అర్ధమై చిరాకేసింది సమీరకి.

''సారీ! నేను వేరే పర్పస్‌కోసం ఈ ఎమౌంటు తీశాను. చాలా అవసరం.'' క్లుప్తంగా అనేసి అతని రియాక్షను పట్టించుకోకుండా వెళ్ళిపోయింది.

అందమైన పేరూ, అందమైన వొళ్ళూ ఆమె ఎసెట్స్. మగవాళ్ళంతా పనిపాటలు మానుకుని తనలాంటి అమ్మాయికోసం బీటేస్తుంటారనీ కలలుగంటారనీ గట్టి నమ్మకం ఆమెకి. కానీ-

మగవాళ్ళు స్త్రీ శరీర సౌందర్యానికన్నా వైటల్ స్టేటస్టిక్స్‌కి ఎక్కువ విలువిస్తారనీ-

అందం అనే మాటకి స్త్రీ ఒకలాగా పురుషుడు మరోకలాగా అర్ధాలు ఆపాదించుకుంటారనీ ఆమెకి తెలీదు.

అంతేకాదు. ఆమెకి తెలీనివి చాలా వున్నాయి. ప్రేమ అనేది సినిమాల్లో మాత్రమే బహిరంగంగా ప్రకటింపబడుతుందనీ, వాస్తవంలో అది మానవ జీవితాల్లో అంతర్వాహినిగా వుంటూ బంధాలని బలపరుస్తుందనీ-

దేవుడు సృష్టించిన అందంకన్నా మనిషికి తనే సృష్టించుకున్న డబ్బు చాలా ముఖ్యమైనదనీ-

యిలా చాలా తెలీవు. ఇవేవీ తెలీని అంధకారంలో వున్న సమీర వచ్చిన ప్రతి సినిమా చూస్తుంది. టీనేజీ లవ్ స్టోరీస్ చూసి ఆశ్చర్యపడ్తుంది. వాళ్ళ కార్లూ, సొఫిస్టికసీ చూసి తనకీ అలాంటి జీవితం అమిరివుంటే బావుణ్ణనుకుంటుంది. బడితల్లా ఎదిగిన కధానాయికలు ఓ వైపు హీరోతో గ్రంధాలు నడుపుతూనే మరోవైపు టెడ్డీబేర్ బొమ్మల్తో ఆడుకోవడం చూసి ముచ్చటపడ్తుంది. తనూ రెండు మూడు బొమ్మలు కొనుక్కుంది గానీ తల్లి చూస్తే కోప్పడుతుందని బట్టల అడుగుని దాచేసింది. అన్నిటికీ మించి తన అందానికి దాసోహమంటూ ఏ రాకుమారుడో వచ్చేస్తాడని ఆశపడ్తుంది.

ఉత్తమ్‌తో ఆమె పరిచయం సినిమాటిగ్గానే జరిగింది.

ఆరోజు..

రోడ్డు మీద పరధ్యానంగా నడుస్తోంది సమీర. వెనక నుంచీ కారు హారన్ మోగినా వినపడలేదు. దాదాపు రాచుకుంటున్నట్టు కీచుమని శబ్దం చేస్తూ ఆగింది ఎర్రటి మారుతీ.

''ఏ అమ్మాయ్! చూసుకుని నడవ్వక్కర్లేదా?'' రఫ్‌గా అడిగాడు డ్రైవరు.

తుళ్ళిపడింది సమీర.

తర్వాత రేర్ సీట్లోంచి బైటికి తొంగిచూసిన ఓ తలకాయ్‌ని చూసి సమీర షాకైంది. అతనూ అంతే! ఆమె అంతటి అందమైన అమ్మాయిని ఎప్పుడూ చూడనట్టు విభ్రాంతి! తర్వాత పెదాల మీద మందహాసం.

కారు కదిలిపోయే దాకా అలాగే నిలబడింది ఆమె.

ఆఫీసుకి చేరుకోగానే ఫోనొచ్చింది. తండ్రి దగ్గర్నుంచేమోననుకుని రిసీవర్ ఎత్తితే... కాదు.

''హలో! ఉత్తమ్ దిస్‌సైడ్'' మెత్తటి వాయిస్. ఎందుకో మారుతీకారతను గుర్తొచ్చాడు సమీరకి. అతనేనేమోననిపించింది.

''మీ పేరు?''

''సమీర.'' అతన్నే దృష్టిలో వుంచుకుని అంది.

''నైస్ నేమ్. ఎల్లైసీలో ఏం చేస్తుంటారు? క్లర్కా?''

''ఊ....మీరు?'' సందిగ్ధంగా అడిగింది.

''ఇప్పుడే కలుసుకున్నాం. అప్పుడే మర్చిపోయారా?'' అతని గొంతులో టీజింగ్.

అతనే మారుతీకారతను. ''ఓహ్!సారీ!'' అంది సమీర.

''సాయంత్రం అదే స్పాట్‌లో మీ కోసం వెయిట్ చేస్తుంటాను'' అతను రిసీవర్ క్రెడిల్ చేసేశాడు.

తెలివిగల మరో అమ్మాయైతే ఒక అపరిచితుడికి అలాంటి అవకాశం యిచ్చేది కాదు. ఇచ్చింది కాబట్టే ఆమె సమీరైంది.

ఒక సాయంత్రం కాదు. ఎన్నో సాయంత్రాలు అతన్తో షికార్లు తిరిగింది. మారుతీకార్లో అతని పక్కని కూర్చోవటం... అతని వంటి నుంచీ వచ్చే కాస్ట్లీ పరిమళాలూ... అతని చుట్టూవుండే రిచ్ ఎట్మాస్ఫియరు.. అన్నీ ఆమెని కలల ప్రపంచంలోకి తీసుకెళ్తున్నాయి.

రోజూ ఉత్తమ్‌తో కలిసి తిరగటం ఆమెకి థ్రిల్లింగ్‌గానే వుంది కానీ కొంత యిబ్బంది కూడా వుందందులో. డ్రెసెస్ మెయిన్‌టెయిన్ చెయ్యాలి. ఆమెకి చీరలూ డ్రెస్సులూ కలిపి పాతిక దాకా వున్నాయి. వాటిల్లో కాస్ట్లీవి మాత్రమే వాడుతోందిప్పుడు. అలాంటివి పదో పన్నెండో మాత్రమే తేలాయి. రోజువారీ వాడకానికి తన కాస్ట్లీ చీరలివ్వడానికి ఆమె తల్లి అభ్యంతరపెడ్తోంది. నాలుగు కాశ్మీర్ శిల్కు చీరలు కొనుక్కోవాలని పిఎఫ్ లోంచీ డబ్బుతీసింది సమీర. ఇప్పుడు ఉత్తమ్‌తో కలిసి షాపింగ్ చెయ్యబోతోంది. బహుశః బిల్లు అతనే చెల్లిస్తాడేమో! కానీ ఆమె దగ్గిర కూడా డబ్బుండాలి కదా!

బస్‌స్టాప్ దగ్గిర నిల్చుంది. అనుకున్న టైముకి కారొచ్చి ఆమె ముందు ఆగింది. డోరు తెరుచుకోవడం, ఆమె అందులో ఎక్కడం అన్నీ తృటిలో జరిగిపోయాయి.

ముందుగా షాపింగ్‌కి వెళ్ళారు. సమీర ఆశించినట్టు బిల్లు అతనే పే చేశాడు. తర్వాత త్రీస్టార్ హోటల్లో ట్రీట్ యిచ్చాడు.

''అకేషన్?'' అడిగింది సమీర.

''నథింగ్ స్పెషల్'' నవ్వేడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు.

''వీహేవ్ కమ్ ఫార్‌లాంగ్. రాత్రికి యిక్కడే రూమ్ బుక్ చెయ్యనా?''

అతని వుద్దేశ్యం అర్ధమయ్యీ కానట్టు...అదేం లేదు, స్పష్టంగానే అర్ధమైంది సమీరకి. ముఖంలోకి చివ్వుమని రక్తం చిమ్మింది. తను ప్రేమనుకుంటున్నదాన్ని....యితనేమిటిలా బ్లంట్‌గా అడుగుతున్నాడు?

''పెళ్ళికాకుండా నాకిలాంటివి నచ్చవు..'' నెమ్మదిగా అంది.

''పెళ్ళి?!...యూమీన్ మేరేజ్....విత్‌మీ!?''

అతను చిన్నగా నవ్వాడు. మొహంలో అదోలాంటి కన్నింగ్‌నెస్...తర్వాత భుజాలు ష్రగ్ చేశాడు. అదోలాంటి నిర్లక్ష్యం. సమీరకవేం అర్ధం కాలేదు.

లేచి నిల్చున్నాడు. ''ఓకే లెటజ్‌మూవ్. రేపు కలుద్దాం'' అన్నాడు.

రేపు..రేపేం చెప్తాడితను? పేరెంట్స్‌ని అడిగి జవాబు చెప్తాడా? పెళ్ళి చేసుకుందామంటాడా? లేక వద్దంటాడా, యింత...దూరం...వ..చ్చే..క?

ఆ రాత్రి సమీరకి నిద్రపట్టలేదు. టెక్నికలర్ కలలొచ్చాయి.

★★★

ఎప్పట్లాగే బస్‌స్టాప్‌లో వచ్చి నిలబడింది సమీర. కారొచ్చి ఆమె ముందు ఆగడం, ముందుడోర్ తెరుచుకోవడం, ఆమె ఎక్కడం, తలుపుమూసుకోవడం- అన్నీ

ఎప్పట్లాగే జరిగిపోయాయి. సీట్లో సర్దుకుంటూ తల తిప్పి చూసి తెల్లబోయింది. డ్రైవింగ్ సీట్లో వున్నది ఉత్తమ్ కాదు. ఒడ్డూ, పొడుగూ, రంగూ పోలికల్తో సహా ఉత్తమ్‌లాగే వున్నాడు. వయసు మాత్రం యాభైకి పైనే వుంటుంది.

సమీరని చూసి చిన్నగా నవ్వి ''నేను ఉత్తమ్ తండ్రిని పేరు సంజయ్'' అన్నాడు పరిచయం చేసుకుంటూ.

సమీర గౌరవంగా నమస్కరించింది.

కారు రోడ్డు మీద స్మూత్‌గా వెళుతోంది. తను ఉత్తమ్‌తో పెళ్ళి గురించి అన్నమాటకి యింత యింపాక్ట్...అతను తండ్రిని పంపించి మాట్లాడించడం...అతని డీసెన్సీకి ఎంతైనా ముచ్చటపడింది సమీర.

''నాకు నలుగురు కొడుకులు, యిద్దరు కూతుళ్ళు. ఇద్దరు కొడుకులు వాళ్ళ భార్యల్తో సహా జిడ్డాలో వుంటారు. ఒక కొడుకూ యిద్దరు కూతుళ్ళూ స్టేట్స్‌లో సెటిలయ్యారు. మిగిలింది ఉత్తమ్ ఒక్కడే. నా భార్యపోయి ఏడాదైంది.''

తనాయనికి కాబోయే కోడలుగాబట్టి యివన్నీ చెప్తున్నాడన్న భావనతో చాలా శ్రద్ధగా వింది సమీర.

''నా భార్యకి పిల్లలంటే చాలా యిష్టం. మా మనవలంతా మా దగ్గిరే వుంటారు. ఉత్తమ్‌కి కూడా చేసేస్తే ఆఖరి బాధ్యత కూడా తీరిపోతుంది. బిజినెస్‌వాడికి అప్పగించేసి పిల్లల్తో జాలీగా గడపాలని నా కోరిక. వాడి క్కూడా సెటిలైపోయింది. అమ్మాయి గ్రీన్‌కార్డు హోల్డరు...డాక్టరు..వీడక్కడికి వెళ్ళాలనుకుంటే బిజినెస్ వైండప్ చేసేస్తాను. ఆమె యిక్కడికొస్తే...''

సమీర వులిక్కిపడింది. ఆమె చెవులపడ్డ ఆ ఆఖరి మాటలు. మెదడులో చేరి గొప్ప సంచలనాన్ని సృష్టించాయి. అదామె ముఖంలో ప్రతిబింబించింది.

''నీకు కార్లలో తిరగడమన్నా ఖరీదైన బట్టలు కట్టుకోవడమన్నా చాలా యిష్టంలా వుంది. ఇష్టం ఒక్కటే అర్హత కాదు. నన్ను చేసుకో. నా మనవలకి కేర్ టేకర్‌గా వుండచ్చు. నాక్కూడా చాలా ప్రాబ్లమ్స్ సాల్వౌతాయి. నీ సరదాలూ తీర్తాయి.''

కారు ఒక్క కుదుపుతో ఆగింది. సమీర నోటిమాట మర్చిపోయి చెవులప్పగించి వింటున్నదల్లా ఒక్కసారి యీ లోకంలోకొచ్చింది. విండోలోంచి బయటికి చూస్తే తను బయల్దేరిన చోటికే మళ్ళీ వచ్చి చేరినట్టు అర్థమైంది. డోర్ తెరుచుకుని దిగింది. దిగేముందు పర్సులోంచీ ముందు రోజు డ్రా చేసిన ఎమౌంటు తీసి సీట్లో పెట్టి ''నిన్నటి చీరల బిల్లు'' అంది క్లుప్తంగా.

సంజయ్ దాన్ని జేబులో పెట్టుకున్నాడు. ''నీకిష్టమైతే యీ నెంబర్‌కి రింగ్ చెయ్యి. ఉత్తమ్‌ని కలుసుకునే ప్రయత్నం చెయ్యకు. ఎందుకంటే...వాడే నాకీ సలహా యిచ్చింది'' విజిటింగ్ కార్డు తీసిచ్చాడు.

కారు కదిలిపోయింది. సమీర చేతిలో సంజయ్ పెట్టిన కార్డు కిందపడిపోయింది. అలాగే కారు వెళ్ళిన వైపు చూస్తూ నిలబడిపోయింది.



తలలో ఏవో భాగాలు ఫెళ ఫెళ విరిగి కూలిపోతున్న భావన! చెవుల్లో హోరు! కళ్ళముందు నల్లటి వలయాలు తిరిగాయి. అవమానంతో ఆమె మనస్సు భగ్గుమంది. ఆ మంటల్లో ఆమె కలల సౌధాలన్నీ మండి మసైపోయాయి. వాటిమీద అధిష్టించి కూర్చున్న ఆమె వాస్తవంలో పడింది.

ఎంత ఫూలిష్‌గా ఉత్తమ్ వెంటపడింది తను! అతన్ని అందుకునే అర్హత తనకి వుందా?

వేదమూర్తి గుర్తొచ్చాడామెకి. పిల్లాడి ఫీజుకోసం ఐదొందలు అప్పు కావాలని అతను...తన తండ్రంతటి వాడు నోరు తెరిచి అడిగితే సాయం చెయ్యలేకపోయింది. అటువంటిది తనకన్నా ఎన్నోమెట్లు పైనున్న ఉత్తమ్ దిగి వచ్చి అతని సుఖభోగాల్లో వాటా యిస్తాడని ఎలా ఆశించింది.

విలాసాల పట్ల యిష్టం ఒక్కటే ఉత్తమ్‌ని చేసుకోవడానికి అర్హత కాదన్నాడు సంజయ్.

నిజమే! తనెప్పుడైనా నిజాయితీగా ఉత్తమ్‌ని ప్రేమించిందా? అతని సమక్షంలో వెన్నపూసలా ఎన్నడేనా కరిగిపోయిందా? అతన్ని చేసుకున్నాక తనకందుబాటులోకి వచ్చే సుఖాలమీదే తన దృష్టి వుండేది. దాన్నతను బాగానే గ్రహించాడు. ఎంతదూరంలో వుంచాలో అంత దూరంలో వుంచాడు. డబ్బే తనకి ప్రధానమైనప్పుడు చేసుకోవడానికి ఉత్తమ్ అయినా సంజయ్ అయినా ఒకటే. మనిషి ప్రధానమనుకున్నప్పుడే వాళ్ళిద్దరికీ తేడా చూడవల్సిన అవసరం వుంది.

తల బలంగా విదిల్చింది.

ఇంక ఆ విషయం ఆలోచించదల్చుకోలేదు, ఎందుకంటే యింకోసారి అలాంటి పిచ్చిపని చెయ్యబోదు కనుక! ★